# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు సమావేశమైన రాష్ట్ర మంత్రి వర్గం ఎస్సీ వర్గీకరణతో సహా పలు అంశాలపై చర్చిస్తోంది.**

2. **విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లిశ్రీతీ కలిపి మెగాసిటీగా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**

3. **రాష్ట్రవ్యాప్తంగా వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ఈ రోజు నుంచి 'ఇంటింటికీ మన మిత్ర' పేరుతో అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది.**

4. **రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

5. **ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్యం కోసం వచ్చే వారికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రాజధానిలో చేపట్టే ప్రాజెక్టులపై మంత్రి వర్గం చర్చిస్తోంది. అలాగే రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ-సీఆర్డీఏ నిర్ణయాలకు ఆమోదం తెలిపే అవకాశముందని అధికారులు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ నివేదిక, ప్రధానమంత్రి పర్యటన, వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న సౌర, పవన, హరిత ప్రాజెక్టులు వంటి అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లిని కలిపి మెగాసిటీగా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. రాజధాని ప్రాంతంలో మంత్రి ఈ రోజు పర్యటించి రాజధాని నిర్మాణానికి అవసరమైన గ్రావెల్, మట్టిని పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాజధానిలో 92 పనులను 64 వేల 912 కోట్ల రూపాయలతో చేపట్టామని అన్నారు. అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 27 సెకన్లు

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ఈ రోజు నుంచి 'ఇంటింటికీ మన మిత్ర' పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రియల్ టైమ్ గవర్నెన్స్ కార్యదర్శి కె.భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరి ఫోన్లో మన మిత్ర వాట్సాప్ నంబర్‌ను నమోదు చేయాలని సూచించారు.

---------------------------

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లో మంత్రి నిన్న ఆకస్మిక తనిఖీలను నిర్వహించి ధాన్యం తేమ శాతం కొలిచే యంత్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతు సహాయ కేంద్రాల్లో ధాన్యం విక్రయించడం ద్వారా, గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టే రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేస్తూ,

..వాయిస్.. 33 సెకన్లు

---------------------------

ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్యం కోసం వచ్చే వారికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. నంద్యాలలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిన్న నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుప్రతికి ప్రతిరోజు దాదాపు 1500 మంది వస్తుంటారని, వారందరికీ వైద్యులు అందుబాటులో ఉండి వైద్య చికిత్సలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సదుపాయాలతో పాటు ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, మరమ్మతుల కోసం మంజూరైన నిధుల నుండి వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

అనాథలైన చిన్నారులకు ఆర్థిక చేయూతను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తోందని తిరుపతి జిల్లా మిషన్ వ్యాత్యల్య పథకం ఇన్చార్జ్ శాంతిదుర్గ తెలిపారు. తిరుపతిలో ఆమె ఈరోజు పాత్రికేయులతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జిల్లా బాలల సంరక్షణ విభాగం ద్వారా ఈ పథకాన్ని అమలుచేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా అనాథలైన చిన్నారులకు ఆర్థిక భద్రతను కల్పించవచ్చని

ఆమె తెలియజేస్తూ,

..వాయిస్.. 23 సెకన్లు

---------------------------

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం దేవస్థానంలో శ్రీభ్రమరాంబికా దేవి అమ్మవారికి ఈరోజు వార్షిక కుంభోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి ఈ ఉదయం తొలి విడత సాత్వికబలిగా కొబ్బరి, నిమ్మ కాయలు, గుమ్మడికాయలను సమర్పించారు. కాగా ఈరోజు సాయంత్రం స్వామిఅమ్మవార్లకు వెండి రథోత్సవాన్ని నిర్వహించనున్నామని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని, అనంతరం స్వామివారికి అన్నాభిషేకం జరుగుతుందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 29 సెకన్లు....

---------------------------

దేశ వ్యాప్తంగా ఉన్న చిన్నారులు, స్త్రీల ఆరోగ్య పరిరక్షణ కోసం పోషక ఆహారాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం "జాతీయ పోషకాహార మిషన్ "ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 7 వ విడత పోషణ పక్షోత్సవాలను ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహిస్తోంది. పోషన్ పఖ్వాడా చిన్నారుల జీవితంలో పోషక అభివృద్ధికి కీలకమైన మొదటి వెయ్యి రోజులపై దృష్టి పెడుతుంది. తీవ్రమైన పోషకాహార లోపం ఉన్న వారిని ముందుగా గుర్తించి తగిన సంపూర్ణ పోషణ అందించేలా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అలాగే ఈ కార్యక్రమం, పోషకాహార ప్రాధాన్యాన్ని తెలియజేయడంతో పాటు బాలల్లోని ఊబకాయంపై దృష్టి సారిస్తుంది.

=====================